ఐఐటీహెచ్‌లో ల్యాండైన మంత్రుల హెలిక్యాప్టర్

స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదర రాజనర్సింహకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ పారితోష్ పంకజ్, అధికారులు

కంది, మే 19: సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం మంత్రుల హెలిక్యాప్టర్ ల్యాండ్ అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటన ముగించుకొని అందోల్ పర్యటనలో భాగంగా సంగారెడ్డికి చేరుకున్నారు. జిల్లాకు చేరుకున్న శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి స్వాగతం పలికారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అదే హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లిపోగా, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదర రాజనర్సింహ వాహనంలో అందోల్ బయలుదేరి వెళ్లారు.

భూ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి

కంది, మే 19 : జాతీయ రహదారి వెడల్పులో భాగంగా ఆస్తులు కోల్పోతున్న మాకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కంది గ్రామానికి చెందిన బాధితులు మొర పెట్టుకున్నారు. రహదారి నిర్మాణంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లు, స్థలాల యజమానులకు కంది గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కంది గ్రామ పంచాయతీలో భూ బాధితులతో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నందున భూ బాధితులకు పలు సూచనలు, సలహాలు చేసి సహకరించాలని కోరారు. వంద ఫీట్ల నిబంధన లేకుండా పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. సమావేశంలో కంది పంచాయతీ కార్యదర్శి కవిత, సిబ్బంది మల్లేశం, భూబాధితులు పాల్గొన్నారు.

కేతకీలో జడ్జి పూజలు

జడ్జిని సన్మానించిన ఆలయ ఈవో శివరుద్రప్ప

ఝరాసంగం, మే 19 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయాన్ని సోమవారం మహారాష్ట్రలోని అమరావతి జిల్లా దర్యాపూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఓం శంకర్ పాటిల్ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా జడ్జీకి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ

నారాయణఖేడ్, మే 19 : నారాయణఖేడ్ మండలంలోని కొనుగోలు కేంద్రాలను సోమవారం ఐకేపీ డీపీఎం జయశ్రీరాజ్ పర్యవేక్షించారు. ఇందులో భాగంగా కొండాపూర్, గంగాపూర్, తుర్కపల్లి కొనుగోలు కేంద్రాలను సందర్శించి కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని స్థానిక సిబ్బందికి ఆదేశించారు. ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట ఏపీఎం వంశీకృష్ణ, సీసీ అశోక్‌గౌడ్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో ఒకరికి ఏడు రోజుల జైలు

గుమ్మడిదల, మే 19 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి 7 రోజుల జైలు శిక్షపడింది. గుమ్మడిదల ఎస్సై భరత్ భూషణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న గుమ్మడిదల ఎక్స్ రోడ్డు వద్ద గుమ్మడిదల పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా గుమ్మడిదల గ్రామానికి చెందిన సోమన్నగారి నరేందర్ గౌడ్ (రాజు గౌడ్) పోలీస్ సిబ్బందిని దుర్భాష పదజాలంతో ఇబ్బంది పెట్టాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించి, కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఏడు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

నాణ్యతాలోపం లేకుండా రోడ్డు పనులు చేపట్టాలి

కంది, మే 19 : నాణ్యతాలోపం లేకుండా రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ జగదీశ్వర్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కంది మండలం చిమ్నాపూర్ నుంచి చిమ్నాపూర్ తండా వరకు రూ. 1.34 కోట్లతో చేపడుతున్న బీటి రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు దీపక్ కుమార్, సంతోష్ రెడ్డి, అరవింద్ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప విగ్రహప్రతిష్ఠాపన

ఆరుట్లలో విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

కంది, మే 19 : కంది మండల పరిధిలోని ఆరుట్లలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు, గొల్లకుర్మల సహాయ సహకారాలతో నూతనంగా బీరప్ప ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూడు రోజులుగా హోమాలతో పాటు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ నాయకులు మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు రాంరెడ్డి సమక్షంలో గజస్తంభారోహణం తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. గ్రామ మాజీ సర్పంచ్ ప్రసన్న రాంరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మహిళ నిర్లక్ష్యంతో బాలుడి మృతి

అమీన్‌పూర్ మే 19 : ఓ మహిళ నిర్లక్ష్య కారు డ్రైవింగ్ కారణంగా బాలుడు మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేశ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సిగూడెంలో నివాసముండే శేఖర్ కూతురు ఏకవాణి (16) కొడుకు మనిధర్ వర్మ (10) ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో నవ్య కాలనీలో ఉండే మహేశ్వరి ఆమె భర్త రవి శేఖర్‌తో కలిసి తమ కారులో డ్రైవింగ్ నేర్చుకోవడానికి మైదానానికి చేరుకున్నారు. మహేశ్వరి కారును అజాగ్రత్తగా నడపడంతో మైదానంలో ఆడుకుంటున్న ఏకవాణి, మణిధర్ వర్మలపైకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు హుటాహుటినా బీరంగుడలోని దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మనిధర్ వర్మ మృతి చెందాడు. ఏకవాణికి చికిత్స అందించడంతో ప్రాణాపాయస్థితి నుంచి బయటపడినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

జిన్నారం, మే 19 : జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజీపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 180, 181, 182 లోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వెంటనే అధికారులు స్పందించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ జిల్లా, మండల అధికారులను సోమవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే నంబర్లలో ఆక్రమణకు గురైన భూములను విచారణ జరిపి రక్షించాలని కోరారు.

కల్హేర్‌లో..

కల్హేర్, మే 19: కల్హేర్ మండల పరిధిలోని మార్డి పెద్ద చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురవుతుందని ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఆయకట్టు రైతులు కల్హేర్ తహసీల్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు తహసీల్దార్ శివ శ్రీనివాస్ ఇరిగేషన్ ఏఈ అలేఖ్యరెడ్డితో కలిసి పెద్ద చెరువు శిఖం భూమి వద్దకు వెళ్లి చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఏరియాను సర్వే చేయించి, ఒకవేళ భూమి ఆక్రమణకు గురైతే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రహదారులు ఇలా.. వెళ్లేదెలా ?

- గుంతలమయంగా గ్రామీణ రోడ్లు
- నరకయాతన పడుతున్న ప్రజలు

గుంతలమయంగా మారిన చేర్యాల్, ఇంద్రకరణ్ గ్రామాలకు వెళ్లే రహదారి

కంది, మే 19: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతమయంగా తయారై ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండలంలోని ఇంద్రకరణ్, చేర్యాల్, చిమ్నాపూర్, చెర్లగూడెం రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రజలకు నరకం అనుభవిస్తున్నారు. మండలంలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీగా, అధిక జనాభా కలిగిన ఇంద్రకరణ్ రహదారి భయానకంగా తయారైంది. ఈ ప్రాంతంలో పలు పరిశ్రమలు ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో లారీలు, ఇతర వాహనాలు తిరుగుతుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చేర్యాల్ గ్రామం నుంచి బెంగళూర్ హైవేకు కలిసే బీటీ రోడ్డు మొత్తం చిద్రంగా మారింది. ఈదారి గుండా వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. కాశీపూర్ నుంచి కలివేముల, చెర్లగూడెం వరకు ప్రయాణించాలంటే నరకం చూడాల్సిందే మరి. చిమ్నాపూర్ నుంచి కంది వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు దర్శనమిస్తున్నాయి. దగ్గరి వరకు వెళ్తేనే గుంతలు కనిపిస్తుండటంతో వాహనదారులు స్పీడ్‌గా వెళ్లి కంట్రోల్ చేయలేకపోతున్నారు. సంబంధిత అధికారులు కనీ సం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పం దించి గ్రామీణ రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

వైభవంగా రంగనాథస్వామి రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, మే 19 : అందోల్‌లో రంగనాథస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భా గంగా సోమవారం రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదరరాజనర్సింహతో పాటు భక్తులు పెద్ద ఎత్తున హాజరై కల్యాణాన్ని తిలకించారు. స్టేట్‌మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు శ్యామ్‌నాథ్‌శర్మ, మాజీ కౌన్సిలర్లు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్

మొగుడంపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న డీఆర్డీఏ ఏపీడీ బాల్‌రాజ్

జహీరాబాద్, మే 19 : ఉపాధి హామీ పథకం కింద కూలీలు చేపట్టిన పనులతో పాటు అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ బృందం అధికారులు ప్రజాదర్బార్‌లో వివరాలు వెల్లడించారు. సోమవా రం మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు రూ. 6.30 కోట్లతో కూలీలు చేపట్టిన పనులతో పాటు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు ప్రజాదర్బార్‌లో డీఆర్‌పీలు వివరాలను వెల్లడించారు. సామాజిక తనిఖీలో భాగంగా రూ. 22.789 అవినీతి చోటు చేసుకుందని జిల్లా డీఆర్‌డీఏ ఏపీడీ బాల్‌రాజ్ గుర్తించారు. సంబంధిత అధికారుల నుంచి రికవరీని వసూలు చేయాలని ఆదేశించారు. ఏపీడీ పూజ, ఎంపీడీవోఐ మహేశ్, డీవైవో నాగేశ్వర్‌రావు, అంబుజ్‌మెంట్ భోజిరెడ్డి, ఏపీవో గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన దళారులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పోతిరెడ్డిపల్లి రైతులు

సంగారెడ్డి, మే 19 : ప్రభుత్వం పేద రైతులకు జీవనోపాధికి అసైండ్ భూములు కేటాయిస్తే కొందరు దళారులు తమ స్వాలాభానికి రైతులను మోసం చేసి ఎంతో కొంత డబ్బు ముట్టజేసి లాక్కొని ఇతరులకు అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని కలెక్టర్ వల్లూరి క్రాంతికి భూ బాధితుడు సాయిలు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుడు సాయిలు పోతిరెడ్డిపల్లి శివారులోని అసైండ్ భూములు సర్వే నంబర్ 153/ఆ, 154, 155/ఆలో సుమారు 90 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి 65వ జాతీయ రహదారికి అనుకొని కొత్తాపూర్ గ్రామ శివారు వరకు ఉందన్నారు. ఆ భూమిని పేద రైతుల వద్ద నుంచి ఎకరాకు రూ. 60 లక్షల చొప్పున దళారులు కొనుగోలు చేసి ఇతరులకు రూ.2 కోట్లకు పైగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కొక్క రైతుకు ఒక విధంగా డబ్బులు ఇచ్చి మిగతా డబ్బులు ఇప్పటికీ ఇస్తునే ఉన్నారని ప్రభుత్వ భూములు కొనుగోలు చేసి రైతులను మోసం చేసిన దళారులపై చర్యలు తీసుకొని పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు.

శంకర్‌పల్లి-పటాన్‌చెరు రోడ్డును విస్తరించాలి

ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఇస్నాపూర్ వాసి యాదగిరి

పటాన్‌చెరు రూరల్, మే 19 : పటాన్‌చెరు నుంచి శంకరపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు 200 ఫీట్ల వెడల్పు విస్తరించాలని ఇస్నాపూర్ వాసి అంబరి యాదగిరి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. శంకరపల్లి నుంచి పటాన్‌చెరు ప్రధాన రహదారిని అనుకొని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన బీడీఎల్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు ఏర్పాటు కావడంతో రోజురోజుకూ జన సాంద్రత పెరుగుతుందన్నారు. నిత్యం ప్రయాణికుల రద్దీ, ప్రమాదాలను నివారించడానికి రోడ్డును విస్తరించాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

జిన్నారం, మే 19 : జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వాసులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామస్తులు నారబోయిన శ్రీనివాస్, ఎంపీ బాలయ్య మాట్లాడుతూ అలీనగర్ గ్రామం తెలంగాణ కాలనీ సర్వేనెంబర్ 27లో, సర్వే నెంబర్ 10 కాలనీల్లో అక్రమ నిర్మాణాలు రాత్రికి రాత్రే జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూముల్లో కొందరు రియల్ వ్యాపారులు వెంచర్ల రూపంలో ప్లాట్లు నిర్మించి విక్రయిస్తున్నారని అధికారులకు విన్నవించారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములను అక్రమార్కుల నుంచి కాపాడాలని, ఇట్టి భూములను పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు విజ్ఞప్తి చేశారు.

భూసార పరీక్షలు చేయించాలి

గురుజువాడలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్

కోహీర్, మే 19 : సరైన ప్రణాళికలతో వ్యవసాయం చేసి రైతులందరూ అభివృద్ధి చెందాలని బసంత్‌పూర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కోహీర్ మండలంలోని గురుజువాడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలను సాగు చేయాలని కోరారు. సాగునీటిని వృథా చేయొద్దని సూచించారు. రైతులందరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించాలని కోరారు. సమావేశంలో శాస్త్రవేత్తలు ఏడీఏ భిక్షపతి, ఏవో నవీన్ కుమార్, ఏఈవో సంధ్య, రైతులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ చేయించాలి

బస్సులను పరిశీలిస్తున్న ఎంవీఐ విజయ్‌రావు

పటాన్‌చెరు, మే 19 : ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలకు చెందిన బస్సులను వెంటనే యాజమాన్యం ఫిటినెస్ చేయించాలని పటాన్‌చెరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) విజయ్‌రావు తెలిపారు. సోమవారం పటాన్‌చెరులో ఉన్న ఎంవీఐ కార్యాలయంలో ప్రైవే ట్ బస్సులను పరిశీలించి ఫిట్‌నెస్ పరీక్షలు చేశారు. పరీక్షలు చేయించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

జహీరాబాద్ పట్టణ సమీపంలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

జహీరాబాద్/ఝరాసంగం, మే 19 : సీఎం ఈ నెల 23న జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటించనున్న దృష్ట్యా పర్యటన ఏర్పాట్లను సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. సీఎం పర్యటనలో భాగంగా ఝరాసంగం మండలంలోని మచ్నూర్‌లోని కేంద్రీయ విద్యాలయ ప్రారంభోత్సవం, నిమ్జ్ రోడ్డు, బసవేశ్వర విగ్రహం అవిష్కరణ, జహీరాబాద్ పట్టణ సమీపంలోని రైల్వే ప్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఆమె వెంట జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ శెట్కార్, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి, డీఎస్పీ రాంమోహ్మన్‌రెడ్డి, పంచాయతీ అధికారి సాయిబాబా, ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు తిరుమలరావు, దశరథ్, ఎంపీడీవోలు సుధాకర్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రాన్ష్‌ను అభినందించిన కలెక్టర్

రుద్రాన్ష్‌ను అభినందిస్తున్న కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 19 : చిన్న వయస్సులోనే జాతీయ అంతర్జాతీయ అవార్డులను సాధించిన బుడతడు రుద్రాన్ష్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో రుద్రాన్ష్‌కు అవార్డులను అందజేశారు. పటాన్‌చెరుకు చెందిన అపురూప, సత్యనారాయణరెడ్డిల కుమారుడు రుద్రాన్ష్ రెడ్డి అతి చిన్న వయస్సులోనే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 6 రికార్డులను సొంతం చేసుకున్నాడు. ఈ మేరకు కలెక్టర్‌ను తన చాంబర్‌లో రుద్రాన్ష్ కుటుంబ సభ్యులు కలిశారు. రానున్న కాలంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే



చాంద్‌ఖాన్‌పల్లిలో బీరప్పస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 19 : నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండాలో నిర్వహిస్తున్న భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో నిర్వహించిన భోగ్ బండార్‌లో పాల్గొన్నారు. నాయకులు రవీందర్ నాయక్, పండిత్, సర్దార్ నాయక్, రాములు నాయక్, జైపాల్, రామ్‌లాల్, కిషన్ రాజు, ఫకీరా, దశరత్ పాల్గొన్నారు.

బీరప్పస్వామి జాతరలో..

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు చాంద్‌ఖాన్‌పల్లిలో నిర్వహిస్తున్న బీరప్పస్వామి జాతర ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన స్వామివారి కల్యాణోత్సవానికి హాజరై, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు ప్రభాకర్, నగేశ్, పుటాల విఠల్, రవీందర్ నాయక్, నర్సింహులు, గోపాల్, పత్రి విఠల్, దత్తు, సంతోశ్ తదితరులు ఉన్నారు.

మాంసం దుకాణం సీజ్

మాంసం విక్రయదారుడితో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి విశాల్

చౌటకూర్, మే 19 : మండల కేంద్రమైన చౌటకూర్‌లో కుళ్లిన మాంసాన్ని విక్రయిస్తున్న దుకాణాన్ని అధికారులు సోమవారం సీజ్ చేశారు. గ్రామానికి చెందిన ధన్‌రాజ్ చికెన్, మటన్ దుకాణంలో ఈ నెల 14న కోసిన మేక తలకాయను 18తేదీన విక్రయించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి వసంతకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె మాంసం దుకాణాన్ని పరిశీలించి, సీజ్ చేయాలంటూ మండల పశు వైద్యాధికారి విశాల్‌ను ఆదేశించారు. దీంతో ఆయన సమగ్ర విచారణ జరిపారు. కుళ్లిన తలకాయను విక్రయించింది వాస్తవమేనని ధృవీకరించుకొని దుకాణాన్ని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

104వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల మే 19 : పారానగర్ డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 104 రోజులకు చేరుకున్నది. మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయబోయే డంపింగ్ యార్డును రద్దు చేయాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేశారు. వెంటనే డంపింగ్ యార్డును రద్దుచేసి ఇక్కడ గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలనికోరారు. రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

సదాశివపేట : సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

సదాశివపేట, మే 19 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కొనియాడారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చౌటకూర్‌లో..

చౌటకూర్, మే 19 : మండలంలోని శివంపేట గ్రామ శివారులో గల చార్మినార్ బీరు పరిశ్రమలో కార్మికులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి, మే 19 : కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికోదిలేసి మత విద్వేశాలు రెచ్చగొడుతుందని, అందుకు సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేయడానికి సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సుధా భాస్కర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా కార్యదర్శి జయరాజు అధ్యక్షత సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, మే 19 : నేటితరం యువకులు, రాజకీయ నేతలకు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాంచందర్ అన్నారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో పూలమాలలు వేసి నివాళులుర్పించారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

అందోల్, మే 19 : మండలంలోని ఎల్ఎప్ఎల్, ఎస్జీటీలకు నేటి నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో కృష్ణ తెలిపారు. జోగిపేటలోని బాలర ఉన్నత పాఠశాలో నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులుంటాయన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

యాదవ్ శ్మశానవాటిలో చింతిమంటపాలు ప్రారంభం

చింతిమంటపాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు, మే 19 : పటాన్‌చెరులోని యాదవ్ శ్మశానవాటిలో సొంత నిధులతో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ చింతిమంటపాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చితిమంటపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాదవ్ సంఘం అధ్యక్షుడు దేవయ్య